
# దానం



**అబ్బినందున యేదీ లేక పోతే వూరకనే రక్తదానం చేసేవాడు. భార్యకు కూడా తెలియని దానాలు చేసినవాడు యిప్పుడు దానం పుచ్చుకోడానికి సిద్ధంగా వున్నాడు.**

గిరిధరరావు కలిగిన వాళ్ల జాబితాలో పడకపోయినా అడగని వాళ్ల పరిస్థితిని అర్ధంచేసుకుని గుప్తంగా దానం చేసినవాడు. తన దగ్గర ఒక్క పది రూపాయలే మిగిలిన రోజున ఆ పది తనకన్నా అవసరమైన వానికి యిచ్చినవాడు. దానం చెయ్యటం ఒక అలవాటుగా

భార్య భానుమతితో రెండు పదుల కాపురంలో ఆమె లేకపోతే యింట్లో యేదీ జరగని ప రిస్థితి వచ్చింది. మంచి మర్యాదలకు, శీలానికీ కాలానికీ విలువలను ప్రసాదించింది. ఉన్న ఒక బిడ్డ రాధారాణి తల్లి ప్రాణంతో ముడిపెట్టుకుంది. భానుమతి లేకపోతే రాధారాణి లేదు. ఇద్దరూ లేకపోతే తన యిల్లు కూలిపోతుంది.

అసలు యీ జబ్బు యెలా మొదలిడిందంటే యెన్నడూ లేనిది భానుమతికి పిరుకోపం తరచు వచ్చేది. ముఖం వాపు చూసి దోమ కాటేమోనని వూరుకుంటే చిన్న తల తిరుగు. రోగమొకటీ, మందు వేరొకటి కావటం వల్ల ప్రమాద పరిస్థితికి వచ్చింది. చొప్పపామిలో నిప్పు దాచు కున్నట్లు, మంటలు చూసాక గానీ ప్రమాదం తెలుసుకోలేదు. ఉన్నదంతా అమ్మేసి రాయవెల్లూరు ఆసుపత్రికి భానుమతిని తీసుకవెళ్లాడు.

రెండు మూత్రపిండాలు పాడయి పోయాయి. తను ఒక మూత్రపిండం యివ్వడానికి సిద్ధమైతే బ్లడ్ గ్రూపు పడలేదు. తన ఆత్రుతలో తన దగ్గర చుట్టాల కాళ్లం దరివో పట్టాడు. భార్య స్వయం చెల్లెలు బ్లడ్ గ్రూపు సరిపోయింది. ఇక వారం రోజుల్లో ఆపరేషను చేస్తారనగా కారణాలు చెప్పకండా కాదన్నది. మిగతా చుట్టాలు

# బలివాడ కాంతారావు

మౌనంగా కాదనేసారు. ఎందరికో చెప్పాడు. ఒకడు ఒక రోజు ఒక దాతను తెచ్చాడు. ఆ తెచ్చిన వాడెవడో తెలియదు. ఆమె బ్లడ్ గ్రూపు సరిపడిందన్నాడు. అతను కోరిన వన్నిటికీ ఒప్పుకున్నాడు. పెద్ద డాక్టరు దగ్గరకు యీ 'డోనర్'ని తీసుక వెళ్లాడు. డాక్టరు లోకం చూసినవాడు, అనుభవజ్ఞుడు. ఆమెను పరీక్షించి ''ఎంత డబ్బిచ్చారు?'' గిరిధర రావుని ప్రశ్నించాడు.

గిరిధర రావు అబద్ధం చెప్పలేక మౌనందాల్చాడు. ''ఇది దానం కాదు. అనాథపై సవారీ చెయ్యటం?''

అంతతో ఆగక కోపంగా ''కల్తీ వ్యాపారం చేసిన వాళ్లకన్నా, లంచాలు దోచుకున్న వాళ్లకన్నా, అబద్ధాలు చెప్పి సవారీ చేసే వాళ్లకన్నా మీరేవిధంగా భిన్నమైన వారు? ఇది నిలువు దోపిడి'' అన్నాడు.

బెత్తం దెబ్బలు తిన్న బడి పిల్లవానిలా కుదించుక పోతే,అతని కళ్లల్లో నీరు చూసి కామోసు డాక్టరు శాంతించి ''ఈవిడ బిచ్చకత్తె. అందులో గుడ్డిది. అంత మాత్రాన ఆమె ఆరోగ్యంగా బతికే హక్కును మీ డబ్బుతో కొ నేస్తారా?'' ''నా ఆతృతలో చేసిన యీ తప్పును క్షమించండి'' అన్నాడు.

లాడ్జికి వచ్చాక ఒంటరిగా యెంతోసేపు యేడ్చు కున్నాడు. ఒక నమ్మకం-ఇంకొకరికది మూఢ నమ్మకం కావచ్చు.ఐనా తనకు ఆ నమ్మకం పోరాడటానికి శక్తి నిస్తుందేమోనని ఆలోచించాడు. మంచి కొంచెమైనా చాలు, విత్తనం చిన్నదైనా చాలు అన్న సామెత గుర్తు కొచ్చింది. మంచివాని ఆరాటాన్ని అర్థంచేసుకునే యింకో మంచి వాడు వుండి తీరతాడన్న నమ్మకంతో పత్రికల్లోఒక ప్రకటన యిచ్చాడు.''ముప్పయి నలభయి యేళ్ల మధ్య వయసులో వున్నవారు, బ్లడ్ గ్రూపు 'పాజిటివ్' 'ం' గలవారి మూత్రపిండం దానం చేయ మని కోరు తున్నాను. షరా: నా భార్య బ్రతికితే నాఒకే బిడ్డ నిలుస్తుంది.''

తన యెడ్రసు రాసాడు. తన వుద్యోగ వివరాలు, అసలు వునికి కూడా పత్రికా ప్రకటనలో యిరికించాడు.

పది రోజులు దాటినా ఒక్క వుత్తరం రాలేదు. తన వలన వుపకారం పొందిన వందలాది వ్యక్తుల్లో ఒక్కరైనా ముందుకు రాలేదని ఆరాటంలో కొట్టుకు పోతుంటే రెండు వారాలు పోయాక ఒక కవరు లాడ్జిలో పడివుంది. గబగబ విప్పాడు.

''మీరు పత్రికలో ప్రచురించిన ప్రకటన చూశాను. నేను శనివారం పదిహేనవ తేదీన మెయిల్‌లో బయలుదేరి ఆదివారం తెల్లవారే సరికి మద్రాసు సెంట్రల్ చేరుకుంటాను. ఆకుపచ్చని చీర, తెల్ల జాకెట్‌తో, కళ్లకు నీలి అద్దాలు-ప్లాటుఫారంలో ఒక స్తంభం దగ్గర నిల్చుంటాను.మీరు ఆ సరికి మద్రాసు రాగలరని ఆశిస్తున్నాను.

చిట్టెమ్మ

దానవాయిపేట, రాజమండ్రి''

ఎవరీ చిట్టెమ్మ? ఈ పేరెప్పుడూ విన లేదు. ఈ పేరు గలవారికెప్పుడూ తను వుపకారం చేసినట్లు లేదు. బ్లడ్ గ్రూపు గురించి రాయలేదు. వయస్సెంతో రాయ లేదు. బహుశః డబ్బు కోసం వస్తోందేమో? తన అనుమానాలన్నీ ఆసుపత్రిలో పెళ్ళాం తో యేకరువు పెడ్తే''ఏదిచ్చినా దేముడు యెవరో మనిషి ద్వారానే యిస్తాడు కదా!'' అంది.

సుఖాల్లో కంటే, కష్టాల్లో బ్రతికిన బ్రతుకు నించి మనిషి బహుశః నమ్మకాలను యేరుకుంటాడేమో? దంపతులిద్దరూ తమ చేతిలో యేమీలేదని, అంతా భగవదేచ్ఛ అనీ, యేం రాసుంటే అదే జరుగుతుందనీ అనుకుంటే గానీ బతకడానికి తగ్గ కనీస ధైర్యం తెచ్చుకో లేక పోతున్నారిప్పుడు.




ఆదివారం వుదయం, మద్రాసు సెంట్రల్ స్టేషనులో చిట్టెమ్మను సులువుగా పోల్చుకున్నాడు. ఆవిడ తన వెనుకనే నడుస్తుంటే యెన్నెన్నో అనుమానాలు. 'మనిషి యింత లావుగా వుందే? బ్లడ్ గ్రూపు సరిపోయినా యీవిడకు హైబ్లడ్ ప్రెషరో, సుగర్ కంప్లయింటో వుంటే?' ఆవిడ నడుస్తుంటే ప్లాటుఫారం గజగజలాడుతున్నా ఆవిడ గొంతుక అసలే పెగల్లేదు. మాట యెలాంటిదో విందామంటే అన్నీ సైగలతో చెప్తోంది. కొంపతీసి మూగది కాదుకదా!

మూగదైతే మళ్ళీ ఆ డాక్టరుతో చిక్కే.దళసరి నీలి కళ్లద్దాలు పెట్టుకుంది. కళ్ల జబ్బా? ఏమన్నా యెలా తీసుకుం టుందోనన్న భయంతో వూరుకున్నాడు. ఇంత డబ్బిమ్మని అడుగుతుందేమోనని యెదురు చూశాడు. లాడ్జిలో ఆమెకు ప్రత్యేకమైన గది. ఎప్పుడు డాక్టరు దగ్గరకు వెళ్లాలో చెప్పాడు. ఆమెకు కిళ్లీలు అలవాటులావుంది. బహుశః కిళ్లీ దుకాణం వుందే మోనని అనుకున్నాడు. ఇక్కడి భోజనం నచ్చక యింకో హోటల్‌కు వెళ్లి తినటం చూశాడు. ఆమె వెంటపడి డబ్బు చెల్లించడానికి వెళ్తే ఆమె సైగలతోనే ఒప్పుకోలేదు.

ఈ రెండు రోజులలో యీ చిట్టెమ్మ అతనికి అర్థంకాని పొడుపు కథలానే మనసులో తిరుగుతోంది.



ఇటీవల వరంగల్లులో ఆచార్య బి.రామరాజు షష్టిపూర్తి సన్మానోత్సవంలో రామరాజును పుష్పమాలాలంకృతుల్ని చేస్తున్న శ్రీ.బి.దామోదర్ రావు. వేదికపై శ్రీ నేరెళ్ళ వేణు మాధవ్, శ్రీ పే ర్వారం జగన్నాథం, శ్రీ కాళోజి రామేశ్వరరావు ప్రభృతులున్నారు.

మంగళవారం పుదయం డాక్టరు ఆమెనే తనయెదరగా కూర్చోబెట్టి గిరిధర రావును బయట కూర్చోమన్నాడు.

"నీ పేరు?"

"చిట్టెమ్మ"

"మీ ఆయన..."

"లేరు"

"మరి... ఆ..."

"ఈ బొట్టు ఒక నమ్మకంతో పెట్టుకుంటుంటాను."

"నువ్వేదైనా వుద్యోగం చేస్తున్నావా?"

"రాజమండ్రి ఆసుపత్రిలో ఆయాగా వుంటున్నాను."

"నీ మూత్రపిండం నిజంగా దానం చేస్తున్నావా లేక..."

"ముమ్మాటికీ చెప్తున్నాను - దానం చేస్తున్నాను."

"గిరిధర రావుగానీ,భానుమతి గానీ మీ చుట్టమా?"

"కాదు"

"ఇది వరకెప్పుడైనా వారి వలన ఉపకారం పొందావా?"

"లేదు"

"మరి అంత దూరంనించి యెందుకొచ్చావ్?"

"ఇలాగైనా ఒకరి కళ్లల్లో నీరు ఆపగలనని... డాక్టరు గారూ- నేను అన్ని టెస్టులు వెయ్యించుకునే వచ్చాను. ఇవిగో రిపోర్టులు. మీకు అనుమానంగా వుంటే మళ్లీ యిన్నా టెస్టులన్నీ వెయ్యించవచ్చు. ఆలస్యం చేసి ఆ యిల్లాలి బాధను పొడిగించకండి" అంటూ లేచి పోయింది. డాక్టరు ఆమె వైపు యెగాదిగా చూశాడు. అంతే.

ఇద్దరికీ ఆపరేషన్లు అయిపోయాయి. తన భార్య దగ్గరకన్నా చిట్టెమ్మ దగ్గరే గిరిధర రావు కూర్చున్నాడు. తను చెయ్యగలిగిందల్లా తన ప్రియాతి ప్రియమైన భార్యకు చెయ్యగలిగాననీ, ఆ ఆనందం తృప్తీ యీ చిట్టెమ్మ యిచ్చిందనీ అక్కడే ఆమెను కొలిచేటట్లు కూర్చున్నాడు. అలా కూర్చొని ఆలోచించుకుంటే అంతరంలో అనుమానాలు పెనవేసుకున్నాయి. తను దానాలెందుకు చేసినట్లు? ఏదో కష్టాల్లో ఆ పుణ్యం ఆదుకుంటుందనేగా! ఏం కోరకుండా దానం చేసిన చిట్టెమ్మ శిబి చక్రవర్తి కోవలోనికి చేరిపోయిందను కున్నాడు.

భానుమతి యింకా కొన్నాళ్లు ఆసుపత్రిలో వుండాలి. చిట్టెమ్మ విడుదలై అటు యిటూ తిరుగుతోంది. ఆమె ఒంటరిగా తిరిగి వెళ్లి పోతానన్నా గిరిధర రావు ఒప్పు కోలేదు. తనుఆమెతోరాజమండ్రి ప్రయాణమయ్యాడు.

చిట్టెమ్మ యిల్లు చిన్నదే. ఇంట్లో సామాన్లు అట్టే లేవు. ఇంట్లోయింకెవరూ లేరు. ఆమె గబగబ యిల్లూ వాకిలీ తుడిచి వంట చేసింది. భోజనాలయ్యాక కాస్త విశ్రాంతి తీసుకోండని మంచం మీద దుప్పటి పరి చింది.


వెలువడినవి!

* యువతరంలో అసంతృప్తి ఉప్పెన, అరాచక ధోరణులు, ఇలాంటి ఎన్నో సమస్యలపై
మాదిరెడ్డి సులోచన తాజా ఆఖరి నవల
పద్మవ్యూహం (ఆదివారం సీరియల్) - రూ. 20/-
* మైనంపాటి భాస్కర్
మనీ బాంబ్ (ఉదయం సీరియల్) - రూ. 20/-
* యర్రంశెట్టి శాయి
ఎంతెంత దూరం (జ్యోతి మాసపత్రికనుంచి) - రూ.16/-
* పోల్కంపల్లి శాంతాదేవి
ఈ చరిత్ర ఇంకెన్నాళ్ళు (డైరెక్ట్ నవల) - రూ. 16/-
* మాదిరెడ్డి సులోచన
శ్రీ నిలయం (పునర్ముద్రణ) రూ. 18/-
నేరజాణలు మగధీరులు (పునర్ముద్రణ) - రూ. 16/-

మీకు కావలసిన పుస్తకం ధర M.O. చేయండి.
పోస్టు ఖర్చులకు V.P.లో పుస్తకం పంపుతాం!
NBH 85/5

నవసాహితి బుక్ హౌస్
ఏలూరు రోడ్, విజయవాడ-520 002



మల్లాది వెంకట కృష్ణమూర్తి
డైరెక్ట్ నవల
మందాకిని వెల 20/-
ఎందుకు చదవాలి ?



ఎందుకా ?
పాఠకులను ఎడ్యుకేట్ చేసేది కాబట్టి!
వివాహబంధం రొటీన్‌గామారి భార్యా-భర్తలమధ్య పెళ్లయిన కొత్తలో ఉండే థ్రిల్ మాయమయినప్పుడు మళ్లీ దాన్ని పొందే సైంటిఫిక్ ట్రిక్స్ ఈ నవలలో ఉన్నాయి కాబట్టి.



విడుదలైన నెలలోనే 8,000 కాపీలు అమ్ముడైన నవల ఇది ! అయితే ఏమంటారా ?
సమకాలీన యితర పాపులర్ మగ రచయితల పాపులర్ నవలలు కూడా యింతవరకూ ఏవీ విడుదలైన నెలలో ఇన్ని కాపీలు అమ్మలేదు!
ఈ నవల బాగుందనటానికి ఇంతకన్నా నిదర్శనం ఏంకావాలి?
పోస్టులో తెప్పించుకోవాలంటే 10 రూ. ఎమ్.వో. చేయండి. మిగతా 10 రూ.లకి వి.పి. పెట్టి పంపుతాము.
ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్.
3237, రాష్ట్రపతిరోడ్, సికింద్రాబాద్ - 500 003

"విశ్రాంతి మీకు కావాలి. నాకుకాదు. మీరే పడుకోండి" అన్నాడు.

మీరు మీరని యెవ్వరూ పడుకోలేదు. ఈవిడ ఋణం యెలా తీర్చుకోవటం అని అతను ఆలోచిస్తుంటే ఆవిడ చిరునగవు. ఆ నగవు గతం జ్ఞప్తికి తెచ్చుకుని వర్తమానంలో సాధించావన్న సంతోష చిహ్నం. అలా చిరునగవుతో యెదరగా కూర్చున్న చిట్టెమ్మ—

"ఇంకా నేనెవరినో, మీరు పోల్చుకోలేక పోయారు. కానీ మీ విషయాలు నాకెప్పటికప్పుడు తెలుస్తున్నాయి."

"ఎలా?"

"మా పొరుగు వాళ్ల పెద్దల్లుడు మీ ఆఫీసులో పని చేస్తున్నాడు. ఆయన ద్వారానే మీ ఆవిడను మీరు రాయవెల్లూరు తీసుక వెళ్లారని తెలిసింది."

" ఇంతకీ మీరెవరు?"

"ఇంకా పోల్చుకోలేదా?"

"భానుమతి బాధతో మరుపు వచ్చేసింది. మీరే చెప్పండి మీరెవరో?"

"ఇది యిరవై యేళ్ల క్రితం మాట. అప్పుడు నాకు ఒక్క ముఖ్యమైన కోరిక వుండేది. అది తీరని కోరిక అని తెలిసి మరీ కోరుకున్నాను. మీలాంటి..అంటే...మీరే భర్తకావాలని. అప్పటికి మీకు పెళ్లికాలేదు. నాకు అయ్యింది. ఆరోజుల్లో ఆ అవకాశాలు లేకపోయినా మీరు మీ మిత్రునికి మూత్రపిండం యివ్వడానికి సిద్ధపడ్డారు. ఆ సుశీల నండీ నేను..."

"చిట్టెమ్మగా పేరెందుకు మార్చుకున్నారు?"

"ఈ పల్లెటూరి పిల్ల చిట్టెమ్మ పట్నం పిల్లగా కనిపించాలని మావారే సుశీల అని మార్చేసారు. ఆయన పోతూ ఒక విషయం చెప్పారు...'నాకు తెలుసు గిరి అంటే నీ మనసులో ఆరాధన వుందని. అతను ముందు కొస్తే చేసుకో' అని."

గిరిధర రావు మనసు ఒక్కసారి యిరవై యేళ్లు వెనుకకు మళ్లించాడు. పల్చని శరీరం. చక్కని ముక్కు. తనివితీరా చూడాలనిపించే ముఖం. ఆ ముఖంలో మాటాడేటట్లు కదిలే కళ్లు. మర్యాదను పాటించి మమకారాన్ని కాల్చుకున్నాడు. భర్త పోయాక నాలిక చివర వరకు వచ్చిన కోరికను ఆమె నీచమైన కోరిక అనుకుంటుందేమోనని సంశయంతో మౌనం దాల్చాడు. ఆమె కన్న వారింటికి వెళ్లిపోయింది. గిరి భానుమతిని పెళ్లాడాడు.

"నీ ఋణం యెలా తీర్చుకుంటావో? " అన్నాడు. ఎన్నాళ్లనించో అనాలను కున్నది అనేసాడు.

"నేనిచ్చినది దానం కాదు. నాలాంటి మామూలు మనిషి దానం చెయ్యలేదు."

"ఇంకేమిటది?"

"ఫలితం ఆశించి చేసిన దానం దానం కాదు."

"ఏం ఫలితం ఆశించావో వినొచ్చా?"

"ఇప్పుడు మీరు మీ ఆవిడ మీద చూపించే ప్రేమామరాగాలు నా మీద కూడా పడినట్లే లెఖ్ఖ! ఇన్నాళ్లకు యిలా నా కోరిక తీరింది."

ఆమెతోపాటు అతనూ కన్నీటి పొంగును ఆపుకోలేక పోయాడు. ●


# మా నూతన ప్రచురణలు

* రాగహేల (మనో వైజ్ఞానిక నవల)
(ఆదివారం సీరియల్) వాసిరెడ్డి సీతాదేవి.....25·00
* కెప్టెన్ కథ (యువ సీరియల్) నవల
——బీనాదేవి.......................22·00
* పుణ్యభూమీ కళ్ళు తెరు (పునర్ముద్రణ) నవల
——బీనాదేవి.......................30·00
* అతడు అడవిని జయించాడు, డా. కేశవరెడ్డి
(ఆంధ్ర సచిత్ర వార పత్రిక సీరియల్)..........13·00
* పంజరం (డైరెక్టు నవల)
——పి. శ్రీరామచంద్రమూర్తి............10·00
* అన్నీ అడ్డంకులే
(సినిమా తయారీ మీద వ్యంగ్యకథ)
——రావికొండలరావు.....................10·00
* మల్లాది రామకృష్ణ శాస్త్రి కథలు 25·00

## వైజ్ఞానిక ప్రచురణలు

* నరావతారం (పునర్ముద్రణ)
(మానవుని పుట్టు పూర్వోత్తరాలు)
——నండూరి రామమోహనరావు........25·00
* తారాపథం
(ఖగోళ శాస్త్రాధ్యయన సహాయక గ్రంథము)
——కొండముది హనుమంతరావు........20·00
* అద్భుత ప్రపంచం
(అతీంద్రియ శక్తులపై పరిశోధన)
——బి.వి. పట్టాభిరామ్..................15·00

అడ్వాన్సు లేనిదే పుస్తకాలు పంపడం సాధ్యంకాదు! అడ్వాన్సు పంపేటప్పుడు, M.O. కూపనులో మీకు కావలసిన పుస్తకాలు, మీ చిరునామా వివరంగా వ్రాయగలరు.

నవోదయ పబ్లిషర్స్
విజయవాడ-2
గుంటూరు-2

PRAGATHI